సాక్షి
నిజామాబాద్
బుధవారం। 15। మే। 2024



టమాట ధర ధమాల్!

దళారులు, వ్యాపారుల మాయాజాలంతో మార్కెట్‌లో టమాట ధర అమాంతం పడిపోయింది.

- 9లో ▸



'అర్బన్'లో పెరిగిన పోలింగ్

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెరిగింది. గత ఎంపీ ఎన్నికలతో పోలిస్తే ఐదు శాతం అధికం.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.0 /27.0

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. అక్కడక్కడ వర్షం కురిసేఅవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పోలింగ్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని సీపీ కల్మేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలింగ్ శాంతియుతంగా నిర్వహించేందుకు సహకారం అందించిన ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

జహీరాబాద్‌లో 74.63 శాతం..

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కలిపి 74.63 శాతం నమోదైంది. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 16,41,410 ఓట్లు ఉండగా, 12,25,049 మంది తమ వోటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులలో 75.83 శాతం ఓటు హక్కు వినియోగించుకోగా.. మహిళలలో 73.48 శాతం ఓటేశారు. పోలింగ్ కేంద్రాల నుంచి సోమవారం రాత్రి వరకు ఈవీఎంలు ఆయా నియోజకవర్గ కేంద్రాలకు చేరాయి. అక్కడి నుంచి మంగళవారం కౌంటింగ్ కేంద్రానికి భారీ భద్రత మధ్య తరలించారు.

వైద్యాధికారిపై వేటు పడేనా?

కామారెడ్డి టౌన్: లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) లక్ష్మణ్‌సింగ్‌పై బుధవారం విచారణ జరగనుంది. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్ విచారణ జరపనున్నారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు విచారణ ప్రారంభం కానుంది. తమను లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నారని జిల్లాలోని పీహెచ్‌సీల మహిళా మెడికల్ ఆఫీసర్‌లతో పాటు వైద్యాధికారులు రాష్ట్ర, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌తో పాటు ఫిర్యాదు చేసిన పీహెచ్‌సీల మహిళా మెడికల్ ఆఫీసర్‌లు, వైద్యాధికారులు విచారణకు హాజరు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

పోలింగ్ 71.92%

- నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో భారీగా ఓటింగ్
- 2019 ఎన్నికలతో పోలిస్తే 3.55 శాతం పెరిగిన పోలింగ్
- శాసనసభ ఎన్నికలను తలపించిన ఓటరు చైతన్యం
- పోటెత్తిన మహిళా, యువ ఓటర్లు
- 'అర్బన్' మినహా మిగతా ఆరు సెగ్మెంట్లలో 73 శాతంపైనే పోలైన ఓట్లు



సీఎంసీలోని స్ట్రాంగ్ రూంలలో ఈవీఎంలను భద్రపరుస్తున్న సిబ్బంది, పర్యవేక్షిస్తున్న ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్



స్ట్రాంగ్ రూంకు సీల్ వేస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో ఓటర్లు పోటెత్తారు. శాసనసభ ఎన్నికలను తలపించేలా ఓటరు చైతన్యం కనిపించింది. ముఖ్యంగా మహిళా ఓటర్లు, యువ ఓటర్లు భారీగా తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సంఘం ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సోషల్ మీడియా ద్వారా భారీగా ప్రచారం జరగడంతో ఓటర్లు భారీగా కదిలారు. చాలామంది యువతీయువకులు విదేశాల నుంచి కేవలం ఓటు వేసేందుకే తరలిరావడం చైతన్యానికి నిదర్శనం. దీంతో నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో భారీగా 71.92 శాతం పోలింగ్ నమోదైంది. 2019 పార్లమెంట్ ఎన్నికతో పోలిస్తే 3.55 శాతం ఎక్కువగా పోలింగ్ నమోదు కావడం గమనార్హం. 2019లో 68.37 శాతం నమోదైంది. కాగా మంగళవారం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ప్రస్తుత పోలింగ్ గణాంకాలను అధికారికంగా వెల్లడించారు. మొత్తం 17,04,867 మంది ఓటర్లకు గాను 12,26,133 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో మహిళా ఓటర్లు 6,73,624 మంది ఉండగా, పురుష ఓటర్లు 5,52,465 మంది, ఇతరులు 44 మంది ఉన్నారు. ఇదిలా ఉండగా 5 నెలల క్రితం జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో 74.13 శాతం పోలింగ్ నమోదైంది.

స్ట్రాంగ్ రూంలకు చేరిన ఈవీఎంలు

- పరిశీలకులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూంలకు సీల్
- సీసీ కెమెరాల ద్వారా అనుక్షణం పర్యవేక్షణ
- సాయుధ బలగాల పహారా

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో ప్రశాంత వాతావరణం మధ్య పోలింగ్ ప్రక్రియ సాఫీగా ముగిసింది. అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రత్యేక కంటెయినర్ వాహనాల్లో ఈవీఎంలను డిచ్‌పల్లి సీఎంసీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు చేర్చారు. ఆయా సెగ్మెంట్ల నుంచి తరలించిన ఈవీఎంలను జాగ్రత్తగా సరిచూసుకుని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా వాటిని స్ట్రాంగ్ రూంలలో నియోజకవర్గాల వారీగా క్రమపద్ధతిలో అమర్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్‌తో పాటు, అభ్యర్థులు వారి ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూంలకు సీల్ వేశారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి గందరగోళం, లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూంలతో పాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చి పర్యవేక్షణ చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఇతరులెవరూ లోనికి వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్, సీపీ ప్రతి కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూంలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అధికారులకు సూచనలు చేశారు. జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అవాంతరాలు తలెత్తకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారులున్నారు.

మహిళల్లో చైతన్యం

మోర్తాడ్(బాల్కొండ): పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో మహిళలు తమ చైతన్యం చాటారు. మగవారి కంటే ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలో మొత్తం ఓటర్లు 17,04,867 మంది ఉంటే ఇందులో మహిళా ఓటర్లు 8,98,647 మంది ఉండగా పురుషులు 8,06,130 మంది ఉన్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న మహిళలు 6,73,624 మంది ఉన్నారు. పురుషులు 5,52,465 మంది మాత్రమే ఓటు వేశారు. మగవారిలో కొందరు ఉపాధి కోసం వలస వెళ్లగా.. మరి కొందరు ఓటు వేసేందుకు ఆసక్తి చూపించలేదు. ఫలితంగా మగవారి కంటే మహిళలు 1,21,159 ఎక్కువ మంది ఓటు వేసి అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్దేశించే స్థాయి ఎదిగారు.



ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద పహారా కాస్తున్న సాయుధ బలగాల పోలీసులు

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పోలింగ్ వివరాలు

అసెంబ్లీ సెగ్మెంట్	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	శాతం
ఆర్మూర్	2,12,145	1,55,159	68731	86,424	04	73.14
బోధన్	2,23,096	1,66,330	78,836	87,494	-	74.56
ని.అర్బన్	3,04,317	1,88,159	92,410	95,726	23	61.83
ని.రూరల్	2,56,593	1,91,252	82,547	1,08,702	03	74.54
బాల్కొండ	2,26,792	1,69,524	71,038	98,486	-	74.75
కోరుట్ల	2,45,249	1,80,867	79,696	1,01,170	01	73.75
జగిత్యాల	2,36,675	1,74,842	79,207	95,622	13	73.87
మొత్తం	17,04,867	12,26,133	5,52,465	6,73,624	44	71.92

రెండేళ్లు.. 27 గేట్లు..!

- వరద గేట్లకు సాగుతున్న మరమ్మతులు
- ఈ సారైనా పూర్తయ్యేనా..!
- గతంలోనే ఆరు గేట్ల మరమ్మతులు
- చేపట్టాల్సినవి మరో తొమ్మిది

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలను గోదావరిలోకి వదిలేందుకు నిర్మించిన వరద గేట్ల మరమ్మతులు రెండేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. మొత్తం 42 వరద గేట్లు ఉండగా.. ఇప్పటి వరకు 27 వరద గేట్ల పనులు మాత్రమే పూర్తి చేశారు. మరమ్మతుల కోసం గత ప్రభుత్వం 2022లో నిధులను మంజూరు చేసింది. అప్పటి నుంచి పనులు సాగుతూనే ఉన్నాయి. సీజనల్‌గా చేపట్టే పనులను వేగంగా చేపట్టాల్సిన అవసరమున్నా అనుకున్నంత వేగంగా సాగడం లేదు. గతంలో వరద గేట్లలో ఆరు గేట్లు టన్ బక్కెల్, రోప్ తెగిపోవడంతో మరమ్మతులు చేశారు. 36 వరద గేట్లకు మరమ్మతు పనులు మొదలు పెట్టినా రెండేళ్లలో 27 గేట్ల పనులు మాత్రమే పూర్తి చేశారు. ఇంకా తొమ్మిది గేట్ల పనులు చేపట్టాల్సి ఉంది. మరో నెల రోజులు దాటితే ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి వరదలు వచ్చే అవకాశం ఉంది. నాలుగేళ్లుగా సంవత్సరాలుగా ఎగువ ప్రాంతాల నుంచి ముందస్తుగానే వరదలు వచ్చి చేరుతున్నాయి. వరదలు ప్రారంభమైతే గేట్ల పనులు మళ్లీ నిలిచిపోతాయి. బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడం కూడా సమస్యగా మారిందని అధికారులు పేర్కొంటున్నారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో అధికారులు సైతం కాంట్రాక్టర్‌పై ఎలాంటి ఒత్తిడి చేయలేకపోతున్నారు. ఫలితంగా మరమ్మతులు నత్తడకన సాగుతున్నాయి.



మరమ్మతులు సాగుతున్న వరద గేట్లు ఇవే..

ప్రస్తుతం అనువైన సమయం

ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీరు 10 టీఎంసీలకు పడిపోయింది. అంటే వరద గేట్లకు స్టాప్ లాక్ గేట్లు వేయకున్నా వరద గేట్ల నుంచి నీరు గోదావరిలోకి వెళ్లే అవకాశం అంతగా ఉండదు. దీంతో పనులు వేగంగా చేపట్టవచ్చు. గతేడాది కూడా ఇలాంటి అవకాశం రాలేదు. గత సంవత్సరం ప్రాజెక్టులో 21 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. ప్రస్తుతం అందులో సగమే ఉంది. దీంతో పనులు చేపట్టేందుకు ఎంతో అనువుగా ఉంటుంది. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

వేగంగా చేపట్టాలని ఆదేశించాం

వరద గేట్ల మరమ్మతులు వేగంగా చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. ప్రస్తుతం నీటి మట్టం తక్కువగా ఉండడంతో పనులు వేగంగా చేపట్టవచ్చు. వరదలు ప్రారంభయ్యే నాటికి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

కలిసిరాని సజ్జ

- కత్తెరకాటుతో సగానికి తగ్గిన దిగుబడి
- పంట సాగు చేసిన రైతుల్లో నిరాశ
- పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన

డొంకేశ్వర్(ఆర్మూర్): యాసంగిలో రైతులు సాగు చేసిన సజ్జ పంట కలిసిరాలేదు. మొక్క దశలోనే కత్తెరకాటు పురుగు ఆశించడంతో బుట్ట సక్రమంగా ఎదగలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో దిగుబడి సగానికి తగ్గిపోయింది. కొంతమంది రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా దక్కలేదు. లాభాలు తెస్తాయనుకున్న సజ్జ నష్టాల పాలు చేయడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఒప్పంద పంట కావడంతో కోసిన పంటను వ్యాపారులకే విక్రయిస్తున్నారు. జిల్లాలో 8,571 ఎకరాల్లో సజ్జ సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. డిమాండ్ ఉండడంతో అంచనాకు మించి 10,094 ఎకరాల్లో సాగు చేశారు. అయితే, కొంతమంది రైతులు క్వింటాలుకు రూ. 7,600 వరకు ఇచ్చేలా వ్యాపారులతో ముందస్తు ఒప్పందం చేసుకుని పంటను సాగు చేశారు. మరికొందరు ఒప్పంద పత్రం లేకుండానే మాటమీద పంటను వేశారు. అయితే, పంట వేసిన కొన్ని రోజులకే సజ్జను కత్తెర పురుగు ఆశించింది. ప్రతికూల వాతావరణం ఉండడంతో రైతులు ఎన్ని మందులు వాడినా పంటలో పురుగు తగ్గలేదు. ప్రభావం చూపే ఎక్కువ ధర కలిగిన స్ప్రే మందులను మూడుసార్లు కొట్టారు. తద్వారా కొంతమేర పురుగు తగ్గుముఖం పట్టింది. కత్తెరకాటు కారణంగా చాలా ప్రాంతాల్లో సజ్జ సరిగ్గా ఎదగలేదు. విత్తన బుట్ట కూడా పూర్తిగా రాలేదు. ప్రస్తుతం ఆర్మూర్, భీమ్‌గల్ నియోజకవర్గాల్లో పంట కోతలు ప్రారంభమయ్యాయి.



దత్తాపూర్ శివారులో పెరగని సజ్జ బుట్ట

ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా, ఐదారు క్వింటాళ్లు మాత్రమే వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులకు రెండు, మూడు బస్తాలు కూడా రాలేదు. దీంతో వారు పెట్టిన పెట్టుబడిని సైతం కోల్పోయారు. కత్తెర కాటు కారణంగా స్ప్రే మందులు, ఎరువులు, పంట కోతలకు కలిపి మొత్తం రూ. 17వేల వరకు ఖర్చయ్యిందని రైతులు వాపోతున్నారు.

ఎకరానికి మూడు బస్తాలే..



సజ్జ వేసిన మొదటి నుంచి కత్తెర పురుగు ఆశించింది. ఎన్ని స్ప్రేలు చేసినా తగ్గలేదు. పురుగు కారణంగా విత్తన బుట్ట అక్కడక్కడ మాత్రమే పెరిగింది. పంటను కోస్తే ఎకరానికి మూడు బస్తాలే దిగుబడి వచ్చింది. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో డబ్బులు నష్టపోయాను.

– లక్ష్మణ్, రైతు, దత్తాపూర్

బుట్ట సరిగ్గా రాలేదు..



రెండు ఎకరాల్లో సజ్జ వేశాను. ప్రతికూల వాతావరణం కారణంగా కీటక నాశిని మందులు వాడినా పంటకు సోకిన పురుగు త్వరగా చావలేదు. ఇప్పుడు సజ్జ కోత దశకు వచ్చింది. బుట్ట అనుకున్నంతగా రాలేదు. ఎకరానికి ఆరు క్వింటాళ్లు దిగుబడి వస్తుందని భావిస్తున్నా.

– చిన్నారెడ్డి, రైతు, నూత్‌పల్లి

మోదీకే ఇందూరు ప్రజల ఓటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

- బీజేపీని విశ్వసించి ఓటేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు
- పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజవర్గంలోని ప్రజలు మోదీకే ఓటు వేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. బీజేపీకి ఓటేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశభవిష్యత్ కోసం జరిగే ఎన్నికలుగా ప్రజలు భావించారని పేర్కొన్నారు. దేశానికి సైనికుడు, రైతు, ఇంటికి తల్లి ఎంత అవసరమో దేశానికి మోదీ అంత అవసరమని ప్రజలు భావించారన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల కంటే ఓటింగ్ శాతం పెరిగిందని బీజేపీ, మోదీపై విశ్వసంతోనే ప్రజలు ఓటువేశారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, బూత్ అధ్యక్షులు పడిన కష్టం బీజేపీని గెలిపిస్తుందన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో రెండోసారి కాషాయ జెండాను ఎగురవేస్తామని, ప్రధాని మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోలైన ఓట్లలో 50 శాతానికిపైగా బీజేపీకి వేశారన్నారు. ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీహనుమంతు, సీపీ కల్మేశ్వర్, అధికార యంత్రాంగం, బీజేపీ కార్యకర్తలు, నాయకులు, మోదీ అభిమానులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, అధికార ప్రతినిధి ప్రమోద్‌కుమార్, సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు మల్లేశ్‌యాదవ్, రాజశేఖర్, పద్మరెడ్డి, రాజన్న, శ్రీనివాస్‌యాదవ్, కిషన్, నారాయణయాదవ్, సరిచంద్, నరేందర్ పాల్గొన్నారు.

లక్ష మెజారిటీతో గెలుస్తాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఎంపీ స్థానాన్ని లక్ష మెజారిటీతో గెలుస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. లక్ష పైచిలుకు మెజారిటీతో గెలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వడంతో రైతులు మాకు ఓట్లు వేశారని తెలిపారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ సత్తా చాటుతుందన్నారు. కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆశించిన స్థాయిలో ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సుపరిపాలన, మచ్చలేని జీవన్‌రెడ్డి అభ్యర్థి కావడం కాంగ్రెస్‌కు ప్లస్ అవుతుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీతో కుమ్మక్కయిన కాంగ్రెస్ గెలుస్తుందన్నారు. రాష్ట్రంలో కూడా మెజారిటీ సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందని తెలిపారు. ఎన్నికల్లో సహకరించిన సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నేతలతో పాటు కార్యకర్తలు కాంగ్రెస్ గెలుపు కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎలాగైనా గెలువలేమని భావించి మతతత్వ పార్టీ అని తెలిసీ బీజేపీకి మద్దతు తెలిపిందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మానాలరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీలు అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, రాజేశ్వర్ రావు, సీనియర్ నాయకులు బాడ్సి శేఖర్ గౌడ్, నగేశ్‌రెడ్డి, వైశాక్షి సంతోష్, వేణురాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్‌కో నేషనల్ డైరెక్టర్‌గా మార గంగారెడ్డి



డొంకేశ్వర్(ఆర్మూర్): ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్స్ కో–ఆపరేటివ్(ఇఫ్‌కో) నేషనల్ డైరెక్టర్‌గా తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి ఎన్నికయ్యారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఇఫ్‌కోకు దేశ వ్యాప్తంగా 21 మంది డైరెక్టర్లు ఎన్నిక కాగా, తెలంగాణ నుంచి మార గంగారెడ్డి ఎన్నిక కావడం గమనార్హం.

క్లుప్తంగా

నరసింహునికి చంద్ర వాహన సేవ



భీమ్‌గల్‌: పట్టణ కేంద్రంలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో ఉత్సవాలు రెండో రోజైన మంగళవారం కొనసాగాయి. ఆలయంలో స్వామి వారికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం దీపారాధన, స్వస్తి పుణ్యాహవచనం, మా తృక, మంటప దేవతా స్థాపన కార్యక్రమాలు నిర్వ హించారు. సాయంత్రం ఆరు గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన చంద్ర వాహనంపై స్వర్ణభరణా లు అలంకరించిన శ్రీ లక్ష్మీ నరసింహుల ఉత్సవ విగ్రహాలను ఉంచి అంగరంగవైభవంగా ఊరేగించారు. భక్తులు లక్ష్మీ నరసింహులను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సివిల్స్‌ ర్యాంకర్‌కు సన్మానం



కామారెడ్డి అర్బన్‌ : యూనియన్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ ఫలితాల్లో ఐపీఎస్‌ సాధించిన రాజంపేట మండలం ఆర్గొండకు చెందిన రజనీకాంత్‌ను పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అంబీర్‌ మనోహర్‌రావు మంగళవారం అభినందించారు. సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన రజనీకాంత్‌ ఐపీఎస్‌ సాధించి జిల్లాకే వన్నె తెచ్చారని పేర్కొన్నారు.. ప్రతి విద్యార్థి రజనీకాంత్‌ ద్వారా స్ఫూర్తి పొందాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు మనోహర్‌రావు అన్నారు.

యువత సానుకూల వైఖరితో ఉండాలి



కామారెడ్డి అర్బన్‌ : యువత ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో విద్యాసాంకేతికాంశాల్లో ముందుకెళ్తే భవిష్యత్తులో మంచి అవకాశాలు పొందుతారని రోటరీక్లబ్‌ కామారెడ్డి శాఖ అధ్యక్షుడు పోలబోయిన సత్యం అన్నారు. మంగళవారం స్థానిక మంజీరా డిగ్రీ కళాశాలలో 'యువత–భవిష్యత్తు–అవగాహన' అంశంపై రోటరీ క్లబ్‌ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మంజీరా కళాశాల డైరెక్టర్‌ గురువేందర్‌రెడ్డి, మోటివేటర్‌ కే సత్యనారాయణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. రోటరీ కార్యదర్శి పి.రాజనర్సింహరెడ్డి, కోశాధికారి తోర్నాల సుధాకర్‌ పాల్గొన్నారు.

సంగారెడ్డికి తరలిన ఈవీఎంలు



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని గీతం యూనివర్సిటీకి తరలించినట్లు అసిస్టెంట్‌ రెవెన్యూ అధికారి మన్నె ప్రభాకర్‌ మంగళవారం తెలిపారు. జహీరాబాద్‌ పార్లమెంట్‌ పరిధిలోని ఎల్లారెడ్డి సెగ్మెంట్‌కు సంబంధించిన 270 పోలింగ్‌ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలు ఓటింగ్‌ పూర్తి కావడంతో వాటిని సంగారెడ్డికి తరలించామన్నారు. జూన్‌ 4న కౌంటింగ్‌ ఉంటుందన్నారు.

అంతర్‌ జిల్లా రోడ్డుపై అవస్థలెన్నో?

- కోతకు గురైన రోడ్డు.. ప్రమాదకరంగా మూలమలుపులు
- ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న ప్రయాణికులు



రెండు వైపులా కోతకు గురైన రోడ్డు



రోడ్డును ఆనుకొని ఏర్పడిన గుంతలు

సిరికొండ: జాతీయ రహదారి నంబర్‌ 44 మీదుగా హైదరాబాద్‌కు వెళ్లేందుకు అనువుగా ఉన్న అంతర్‌ జిల్లా రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్‌ అడ్రస్‌గా మారుతోంది. ఈ రోడ్డు గుండా నిజామాబాద్‌ జిల్లా నుంచి కామారెడ్డి జిల్లాతోపాటు రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాలకు త్వరగా వెళ్లొచ్చు. జిల్లాలోని కమ్మర్‌పల్లి, మోర్తాడ్‌, భీమ్‌గల్‌ ప్రాంతాలకు చెందిన ప్రజలు హైదరాబాద్‌కు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే రోడ్డుపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహించడం పట్ల ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతర్‌ జిల్లా రోడ్డు మీదుగా ప్రయాణమంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. హైదరాబాద్‌ వైపు వెళ్లే ప్రయాణికులు మండలంలోని కొండాపూర్‌ మీదుగా కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం రెడ్డిపేట తండా వరకు దట్టమైన అటవీ ప్రాంతం గుండా వెళ్లాల్సి ఉంటుంది. అటవీప్రాంతానికి అటు, ఇటు వైపు ఉన్న రోడ్డును రెండు వరుసలగా విస్తరించినప్పటికీ.. తొమ్మిది కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతంలోని రోడ్డు సింగిల్‌ రోడ్డుగానే ఉంది. రోడ్డు విస్తరణకు అటవీ శాఖ నుంచి అనుమతులు లభించడం లేదనే కారణంగా విస్తరించడం లేదు. సింగిల్‌ రోడ్డులో అరకిలోమీటరు దూరం మినహా మిగతా భాగం కామారెడ్డి జిల్లా రోడ్లు, భవనాల శాఖ పరిధిలో ఉంది. మండలంలోని కొండాపూర్‌, తూంపల్లి, ముషీర్‌నగర్‌, గడ్కోల్‌, తాళ్లరామడుగు తదితర గ్రామాలకు చెందిన ప్రజలు కామారెడ్డి దగ్గర కావడంతో నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. ఈ రోడ్డు రెండు జిల్లాలతోపాటు రెండు నియోజకవర్గాల పరిధిలో ఉండటంతో రోడ్డు విస్తరణకు మోక్షం లభించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రమాదాలకు నెలవు..!

అటవీ ప్రాంతం మీదుగా సాగే రోడ్డులో తొమ్మిది చోట్ల ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయి. అటవీ ప్రాంతం కావడంతో వర్షాకాలంలో వరదలకు చాలా చోట్ల రోడ్డుకు ఇరు వైపులా మట్టి కొట్టుకుపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు మార్గంలో ఒక వైపు ప్రమాదకరంగా మూలమలుపులు ఉండగా అదే చోట మట్టి కోతకు గురై రోడ్డుకు ఇరు వైపులా భారీగా గుంతలు ఉండటంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటవీ ప్రాంతం మధ్యలో ఒర్రెపై నిర్మించిన కల్వర్టు వద్ద వరద రోడ్డు పైనుంచి నీరు ప్రవహించడంతో సగభాగం వరకు కోతకు గురైంది. ఈ అటవీ ప్రాంతంలో చిరుతలతోపాటు ఎలుగుబంట్లు, అడవి పందులు ఉన్నాయి. సాయంత్రం నుంచి ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారికి చిరుతలతోపాటు ఇతర వన్యప్రాణులు తారసపడుతుంటాయి. గడ్కోల్‌, తూంపల్లి, కొండాపూర్‌తోపాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రయాణికులకు ఈ మార్గంలో రోడ్డు దాటుతు చిరుత కనిపించిన సందర్భాలు ఉన్నాయి. కొండాపూర్‌ వైపు నుంచి వెళ్తుండగా వచ్చే తొలి మూలమలుపు వద్ద గత మూడేళ్ల కిందట బైక్‌ వంతెనను ఢీకొన్న ఘటనలో ఒక బాలుడు మృతి చెందాడు. ఇదే మూలమలుపు వద్ద ఏడేళ్ల క్రితం రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన వ్యక్తి బైక్‌ ప్రమాదంలో మృతి చెందాడు. అటవీ ప్రాంతంలో ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో భీమ్‌గల్‌ మండలం గోనుగొప్పులకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. రోడ్డు ప్రమాదాల్లో పది మంది వరకు మృత్యువాత పడ్డారు. ప్రమాదాలకు నెలవుగా మారిన ఈ రోడ్డును విస్తరించి మూలమలుపులను తొలగించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

“ ఇబ్బందులు పడుతున్నాం



కామారెడ్డికి వెళ్లే మార్గంలో కొండాపూర్‌ అటవీ ప్రాంతంలో ఉన్న సింగిల్‌ లేన్‌ రోడ్డుపై ప్రయాణించాలంటే అవస్థలు పడుతున్నాం. మా గ్రామం నుంచి ప్రతి రోజూ చాలా మంది ఏదో ఒక పనిపై ఈ రోడ్డు గుండానే కామారెడ్డికి వెళ్తుంటారు. రోడ్డును విస్తరించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డును విస్తరిస్తే చాలా సౌకర్యంగా ఉంటుంది. – రహీం, కొండాపూర్‌

అటవీశాఖ అనుమతి రావాల్సి ఉంది

కొండాపూర్‌ అటవీ ప్రాంతంలోని రోడ్డు విస్తరణకు మా శాఖ తరఫున ఐదేళ్ల క్రితమే అన్ని ప్రతిపాదనలు రూపొందించాం. నిధులు సైతం మంజూరయ్యాయి. రోడ్డు విస్తరణకు అటవీ శాఖ నుంచి అనుమతి రావాల్సి ఉంది. అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో ఆ నిధులు రద్దయ్యాయి. అటవీ శాఖ అనుమతులు రాగానే మళ్లీ నిధులు మంజూరు చేయిస్తాం.

– శ్రీనివాస్‌, కామారెడ్డి ఆర్‌ అండ్‌ బీ డీఈ

అర్బన్‌లో పెరిగిన పోలింగ్‌ శాతం



నిజామాబాద్‌అర్బన్‌: అర్బన్‌ నియోజకవర్గం పరిధిలో క్రమంగా ఓటింగ్‌ శాతం పెరుగుతోంది. పార్లమెంట్‌ ఎన్నికల సందర్భంగా అర్బన్‌ నియోజకవర్గం పరిధిలో 289 పోలింగ్‌ బూత్‌లను ఏర్పాటు చేయగా, గత అసెంబ్లీ, పార్లమెంట్‌ ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటింగ్‌ శాతం పెరిగింది. ప్రతి ఎన్నిక పోలింగ్‌ సందర్భంగా జిల్లాలో వెనుకంజలో ఉన్న అర్బన్‌ నియోజకవర్గంలో అధికారుల విస్తృత ప్రచారం కారణంగా ఓటింగ్‌ శాతం పెరుగుతోంది. సోమవారం నాటి పార్లమెంట్‌ ఎన్నికల పోలింగ్‌లో.. ఉదయం కాస్త నెమ్మదిగా ప్రారంభమైన ఓటింగ్‌ ప్రక్రియ మధ్యాహ్నం 12 గంటల తరువాత పుంజుకుంది. ముఖ్యంగా మైనార్టీ ఏరియల్లో నెమ్మదిగా ప్రారంభమై సాయంత్రం వేళ ఓటింగ్‌ శాతం పెరిగింది. వేసవి తీవ్రత దృష్ట్యా ఎక్కువ ఓటర్లు ఉదయమే పోలింగ్‌ కేంద్రాలకు తరలివచ్చారు. కంఠేశ్వర్‌, గంగాస్థాన్‌, సుభాష్‌నగర్‌, గౌతంనగర్‌, వినాయక్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో ఉదయం వేళ ఓటింగ్‌శాతం పెరగగా.. మాలపల్లి, ఖిల్లా, అర్సపల్లి ప్రాంతాల్లో మధ్యాహ్నం వేళ పెరిగింది. ఓటింగ్‌ శాతాన్ని పెంచేందుకు ఈసారి అధికారులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దీనికితోడు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సైతం తమ గెలుపు కోసం ఓటర్లను పోలింగ్‌ కేంద్రాలకు తరలించే ప్రక్రియ చేపట్టారు.

అర్బన్‌ నియోజకవర్గంలో నమోదైన ఓటింగ్‌ వివరాలు

మొత్తం ఓటర్లు	ఓటేసినవారు	శాతం
2019 లోక్‌సభ ఎన్నికల్లో..		
2,68,429	1,51,002	56.24
2024లో లోక్‌సభ ఎన్నికల్లో..		
3,04,317	1,88,159	61.83
2023 అసెంబ్లీ ఎన్నికల్లో..		
2,94,832	1,81,811	61.67

2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 56.24 శాతం ఓటింగ్‌ నమోదైంది. ప్రస్తుత ఎన్నికలసందర్భంగా 61.83 శాతం ఓటింగ్‌ నమోదైంది. గతంతో పోలిస్తే పోలింగ్‌ శాతం బాగానే పెరిగింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 61.67 శాతం ఓటింగ్‌ నమోదైంది.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్‌: ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా కార్పొరేట్‌ కళాశాలల్లో ఉచిత విద్య పొందేందుకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సంక్షేమ శాఖ అధికారిణి శశికళ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ ఏడాది పదో తరగతిలో 7 జీపీఏకు మించి మార్కులు వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు కార్పొరేట్‌ కళాశాలల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎంసెట్‌ కోసం..

ఈ ఏడాది పదో తరగతిలో 7 జీపీఏకు మించి మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు కార్పొరేట్‌ జూనియర్‌ కళాశాలల్లో ఎంసెట్‌ ప్రవేశ పరీక్ష ప్రత్యేక శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు.

విద్యుత్‌ ఉద్యోగులకు అభినందన

నిజామాబాద్‌నాగారం: పార్లమెంట్‌ ఎన్నికల పోలింగ్‌ సమయంలో నిరంతరాయంగా విద్యుత్‌ సరఫరా చేసినందుకు జిల్లాలోని పలువురు విద్యుత్‌ అధికారులకు సీఎండీ వరుణ్‌రెడ్డి ఆఫీసర్‌ ప్రత్యేకంగా అభినందించారని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రవీందర్‌ మంగళవారం తెలిపారు. జిల్లాలోని కోటగిరి, సుభాష్‌నగర్‌, ఆర్మూర్‌ ఏఈ – 2, టౌన్‌ – 2 ఏడీఈ, నవీపేట్‌ ఏడీఈలను ప్రత్యేకంగా అభినందించారన్నారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు గాలివాన బీభత్సం సృష్టించినప్పటికీ.. విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, దీంతో ఓటింగ్‌ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని పేర్కొన్నారు.

క్రైం కార్నర్‌

ట్రాక్టర్‌ బోల్తాపడి యువకుడి మృతి



మోపాల్‌: ట్రాక్టర్‌ బోల్తా పడి మండల కేంద్రానికి చెందిన మెట్టు ఆకాశ్‌ (21) మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్‌ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆకాశ్‌ ట్రాక్టర్‌ వాటర్‌ ట్యాంకర్‌ తీసుకొని సోమవారం కంజర నుంచి మోపాల్‌కు వస్తుండగా, కంజర శివారులోని రైస్‌మిల్‌ వద్ద అదుపుతప్పి ట్రాక్టర్‌ బోల్తా పడింది. ఈ ఘటనలో ఆకాశ్‌ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు మెట్టు ప్రభాకర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..

బాన్సువాడ: పట్టణంలోని షేక్‌ చాంద్‌ హోటల్‌ సమీపంలో సోమవారం సాయంత్రం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని బాన్సువాడ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 80088 09152 నంబర్‌ను సంప్రదించాలని సీఐ కృష్ణ కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వేల్పూర్‌: మండలంలోని అమీనాపూర్‌ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో వేల్పూర్‌కు చెందిన విశ్వతేజ్‌కు తీవ్రగాయాలైనట్లు ఎస్సై వినయ్‌కుమార్‌ తెలిపారు. విశ్వతేజ్‌ తన బైక్‌పై పెర్కిట్‌ వైపు వెళ్తుండగా, వేల్పూర్‌ వైపు మరో వ్యక్తి బైక్‌పై అతివేగంగా వచ్చి ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ఘటనలో విశ్వతేజ్‌ కుడికాలు విరిగడంతోపాటు కుడిచేయికి గాయాలైనట్లు తెలిపారు. బాధితుడి తండ్రి చల్ల సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ప్రేమ వివాహం

ఇందల్వాయి: యువజంట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ప్రేమ వివాహం చేసుకున్నట్లు ఎస్సై మనోజ్‌ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు సిరికొండ మండలం గడ్కోల్‌కు చెందిన యువతి ప్రేమించుకున్నారని, వారు పోలీసులను ఆశ్రయించి పెళ్లి చేసుకున్నారన్నారు. ప్రేమ వివాహానికి పెద్దలను ఒప్పించినట్లు ఎస్సై తెలిపారు.

భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన

- మొదటి భార్య వేధిస్తోందని ఆవేదన
- పోలీసులకు ఫిర్యాదు

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కోటగల్లీలో భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన చేపట్టింది. బాధితురాలు మనస్విని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కోటగల్లీకి చెందిన మనస్విని అదే ప్రాంతానికి చెందిన సిరిపురం శ్రీనివాస్‌ 2016లో పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి సమయంలో మనస్వినికి అత్తగారు ఇంటిని బహుమతిగా ఇచ్చారు. అదే ఇంట్లో కొన్ని సంవత్సరాలుగా ఆమె నివాసం ఉంటోంది. ఈ క్రమంలో శ్రీనివాస్‌ మొదటి భార్య సవిత వచ్చి ఇల్లు ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడుతోంది. దీంతో సవిత నివాసం ఉంటున్న ముంబయికి వెళ్లిన మనస్విని అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుమోటోగా స్వీకరించిన జిల్లా కోర్టు నిజామాబాద్‌లోని నాల్గోటౌన్‌ పోలీసులకు బదిలీ చేసింది. సవితతోపాటు ఆమె తరఫువారు గత శనివారం ఇంటికి వచ్చి దాడి చేశారని మనస్విని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

భత్యంపై ఉద్యోగుల్లో సంతోషం

- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్‌ ఎన్నికల్లో ఎక్కువ చెల్లింపు
- గతంలో ఒక్కో జిల్లాలో ఒక్కో విధంగా..
- ఈసారి రాష్ట్రమంతటా ఒకే టీఏ, డీఏ



మోర్తాడ్‌(బాల్కొండ): ఎన్నికల విధులు నిర్వర్తించిన తమకు ఎన్నికల కమిషన్‌ చెల్లించిన భత్యంపై ఉద్యోగు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శాసనసభ ఎన్నికల పోలింగ్‌ సందర్భంగా చెల్లించిన భత్యంతో పోలిస్తే ప్రస్తుతం ఎక్కువే చెల్లించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కో జిల్లాలో ఒక్కో విధంగా ఉద్యోగులకు భత్యం చెల్లించారు. కొన్ని జిల్లాల్లో ఎక్కువగా నిజామాబాద్‌ జిల్లాలో అతి తక్కువ భత్యం చెల్లించడంతో అప్పట్లో ఉద్యోగులు నిరాశకు గురయ్యారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో మాత్రం రాష్ట్రం అంతటా ఒకే రకంగా టీఏ, డీఏ చెల్లించడంతోపాటు భోజన సదుపాయం కల్పించడం, సర్టిఫికెట్లు ప్రదానం చేయడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పోలింగ్‌ బూత్‌లో పోలింగ్‌ అధికారి(పీవో)తో పాటు అసిస్టెంట్‌ పోలింగ్‌ అధికారి(ఏపీవో), అదర్‌ పోలింగ్‌ అధికారి(ఓపీవో)లు విధులు నిర్వహించారు. పోలింగ్‌ సామగ్రిని రిటర్నింగ్‌ కార్యాలయం నుంచి తీసుకుని తమకు కేటాయించిన పోలింగ్‌ స్టేషన్ల పరిధిలోని బూత్‌లకు ఆదివారం సాయంత్రం చేరుకుని సోమవారం రోజున పోలింగ్‌ విధులను నిర్వహించారు. పోలింగ్‌ అనంతరం మళ్లీ రిటర్నింగ్‌ కార్యాలయంలో సామగ్రిని అప్పగించడం ఏపీవో, పీవో, ఓపీవోల బాధ్యత. రెండు రోజుల పాటు ఎన్నికల విధులను నిర్వహించినందుకు సర్టిఫికెట్లను అందించడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో సర్టిఫికెట్ల జారీలో నిర్లక్ష్యం కనిపించినప్పటికీ.. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండాపోయిందని ఉద్యోగులు చెబుతున్నారు. తమ విన్నపం మేరకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి ఎన్నికల విధుల సర్టిఫికెట్లను వెంటవెంటనే జారీ చేశారని తెలిపారు.

అసెంబ్లీ, పార్లమెంట్‌ ఎన్నికల్లో చెల్లించిన టీఏ, డీఏ

2023 అసెంబ్లీ ఎన్నికల్లో..	
పీవో	రూ.1,700
ఏపీవో	రూ.1,700
ఓపీవో	రూ.1,050
2024 పార్లమెంట్‌ ఎన్నికల్లో..	
పీవో	రూ.3,150
ఏపీవో	రూ.3,150
ఓపీవో	రూ.1,750

ఆరోగ్య కార్యకర్తలకు తొలిసారి..

- ఒక్కో బూత్‌కు రూ.300 చొప్పున చెల్లింపు

మోర్తాడ్‌(బాల్కొండ): ఎన్నికల విధులు నిర్వహించిన ఆరోగ్య కార్యకర్తలకు తొలిసారి భత్యాన్ని ఎన్నికల అధికారులు మంజూరు చేశారు. పోలింగ్‌ కేంద్రాల్లో ఓటర్లకు, పోలింగ్‌ సిబ్బందికి అత్యవసర చికిత్స అందించేందుకు ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లతో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. గతంలో ఏ ఎన్నికల సందర్భంలోనూ వైద్య సిబ్బందికి భత్యాన్ని చెల్లించలేదు. ఈసారి నిజామాబాద్‌ పార్లమెంట్‌ స్థానం పరిధిలోని 1,808 పోలింగ్‌ స్టేషన్‌లకు రూ.300 చొప్పున రూ.5,42,400 విడుదల చేశారు.

ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు ఎంత మంది ఉన్నా.. ఒక్కో బూత్‌కు రూ.300 చొప్పున చెల్లించారు. ఎంతో కొంత భత్యం చెల్లించి తమ పనితీరుకు గుర్తింపు ఇచ్చారని ఆరోగ్య కార్యకర్తలు పేర్కొంటున్నారు.



గుమ్మిర్యాల్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆశ వర్కర్లు(ఫైల్‌)

పోతులకుంటకు పొంచి ఉన్న ముప్పు!

- చెరువు కట్టను తొలగిస్తూ రోడ్డు విస్తరణ
- సమీపిస్తున్న వర్షాకాలం
- పునః నిర్మాణమెన్నడో?
- ఆందోళనలో రైతులు



చెరువు అంచున కొనసాగుతున్న బైపాస్‌ రోడ్డు పనులు



పోతులకుంట ప్రధాన తూము వరకు కట్టను తవ్వేసిన దృశ్యం

బోధన్‌: సాలూర మండల సరిహద్దులోని 63వ నంబర్‌ జాతీయ రహదారికి అనుసంధానంగా బోధన్‌ పట్టణ శివారు నుంచి సాలూర అంతర్‌రాష్ట్ర చెక్‌ పోస్టు వరకు 8.3 కిలోమీటర్ల పొడవునా నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా నాగన్‌పల్లి, సాలూర క్యాంప్‌, సాలూర గ్రామాల శివార్లలో బైపాస్‌ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సాలూర క్యాంప్‌ శివారులోని పోతులకుంట చెరువు కట్టను ఆనుకుని చేపట్టిన బైపాస్‌ రోడ్డు విస్తరణ పనులు చేపడుతుండడంతో చెరువు కట్టను తొలగించారు. చెరువు ప్రధాన తూము అంచు వరకు కట్టను తవ్వేశారు. తూము వద్ద పడమర నుంచి తూర్పు దిశలో సుమారు 50 నుంచి 70 అడుగుల మేర పొడవునా చెరువు కట్టను నెలన్నర క్రితమే తొలగించారు. చెరువు, నిర్వహణ పర్యవేక్షణ నీటిపారుదల శాఖ పరిధిలో ఉంది. ఈ ఏడాది వర్షాలు సకాలంలోనే ప్రారంభమవుతాయని వాతావరణ శాఖ పేర్కొంటుండగా, చెరువు కట్ట పునఃనిర్మాణంలో జాప్యం జరుగుతండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విస్తారంగా వర్షాలు కురిస్తే చెరువులో చుక్క నీరు నిల్వ ఉండే పరిస్థితి ఉండదు. రోడ్డు విస్తరణ పనులను పర్యవేక్షిస్తున్న నేషనల్‌ హైవే అథారిటీ పరిధిలో చెరువు కట్ట పునర్నిర్మాణం బాధ్యత ఉంటుందని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

గొలుసుకట్టు చెరువు

పోతులకుంట చెరువు కింద సాలూర గ్రామ రైతుల సాగు భూములు 50 నుంచి 60 ఎకరాల వరకు ఉన్నాయి. దిగువన ఉన్న కామక్కచెరువు, ఫత్తేపూర్‌ చెరువులకు పోతులకుంట అనుసంధానంగా ఉంటుంది. చెరువులో వర్షం నీటిశాతం పెరిగితే దిగువన ఉన్న కామక్క చెరువులోకి వదులుతారు. ఈ చెరువు నుంచి ఫత్తేపూర్‌ చెరువుకు మళ్లిస్తారు. ఈ మూడు చెరువుల కింద వందలాది ఎకరాల సాగు భూములున్నాయి. వర్షాకాలంలో ఈ భూముల్లో వరి సాగు చేస్తారు. చెరువు కట్ట పునర్నిర్మాణం పనులు యుద్ధప్రాతిపదిక చేపట్టక పోతే రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. నీటిపారుదల శాఖ అధికారులు చొరవ తీసుకొని నేషనల్‌ హైవే అథారిటీ అధికారులపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

“ చెరువును పరిశీలిస్తా

సాలూరా క్యాంప్‌ గ్రామ శివారులోని పోతులకుంట చెరువును బుధవారం పరిశీలిస్తా. నెల రోజుల నుంచి ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యాం. చెరువు కట్ట పునర్నిర్మాణం బాధ్యత నేషనల్‌ హైవే అథారిటీ పరిధిలో ఉంది.

– లోక్యానాయక్‌, డీఈ ఇరిగేషన్‌ శాఖ సబ్‌ డివిజన్‌, బోధన్‌